క్లుప్తంగా

ప్రవేశాలపై ప్రత్యేక శ్రద్ధ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి వెంకటరమణ

డెంకాడ: బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి-1 కె.వి.రమణ ఆదేశించారు. మండల విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త అడ్మిషన్లపై దృష్టిసారించాలన్నారు. బడికి పోదాం కార్యక్రమం విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వి.శ్రీరామ్ పాల్గొన్నారు.

కొప్పెర్ల సచివాలయంలో నీటి పరీక్షలు



కొప్పెర్ల సచివాలయంలో నీటి పరీక్షలు చేస్తున్న ఎంపీడీఓ రాధిక, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల సచివాలయంలో ఎంపీడీఓ ఎం.రాధిక ఆధ్వర్యంలో సిబ్బంది తాగునీటి పరీక్షలు చేశారు. క్లోరైడ్, ఫ్లోరైడ్, పీహెచ్, నైట్రేట్ టెస్టులను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఉమాశంకరి పాల్గొన్నారు.

కార్పొరేషన్ టీచర్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు జ్ఞాపికను అందుకుంటున్న శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: న్యూఢిల్లీలోని ఆదిలీల ఫౌండేషన్ సంస్థ విజయనగరం పట్టణంలోని కంచెర్లవారి మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్ టీచర్ పాట్నా శ్రీనివాసరావుకు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేసింది. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో మంగళవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డును సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ, మీడియా హౌస్ సీఈఓ డాక్టర్ రాజా తలూక్దర్ చేతుల మీదుగా అందజేసింది. విద్యా బోధన, ఉత్తమ ఫలితాల సాధనకు గాను అవార్డును అందజేసింది. ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

చదువుతోనే సామాజిక మార్పు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకళ

భోగాపురం: విద్యార్థుల చదువుతోనే సామాజిక మార్పు సాధ్యమని, బడివయస్సు పిల్లలందరినీ బడిలో చేర్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఎంపీడీఓ జి.చంద్రకళ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులతో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్షించారు. జూలై 12వ తేదీవరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా.. ఆరేళ్ల నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న బడిఈడు పిల్లలందరూ వంద శాతం పాఠశాలల్లో నమోదయ్యేలా చూడాలన్నారు. సచివాలయ, పాఠశాల సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎస్తేరు రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, గ్రామ విద్యా సహాయకులు, సీఆర్ఎంటీలు, పార్ట్‌టైమ్ బోధకులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామాలమ్మ వారాల పండగ



సామాలమ్మతల్లి గుడిచుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని గొల్లలపేట గ్రామంలో సామాలమ్మ తల్లి వారాల పండగను గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి గుడికి మేళతాళాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు చీరలు,పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అక్కడే సంహపక్తి భోజనాలు చేశారు.

సికిల్‌సెల్ ఎనీమియా వారసత్వపు వ్యాధి



అవగాహన సదస్సులో పాల్గొన్న వక్తలతో గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: సికిల్‌సెల్ ఎనీమియా.. వారసత్వంగా వచ్చే హిమోగ్లోబిన్ సంబంధిత రక్త రుగ్మతల సమూహమని జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు తెలిపారు. ఎర్రరక్త కణాలలో కనిపించే ఆక్సిజన్ వాహక ప్రోటీన్ హిమోగ్లోబిన్‌లో అసాధారణతలను కలిగిస్తుందని తెలిపారు. ఈ వ్యాధితో ప్రపంచంలో ఎంతోమంది బాధపడుతున్నారన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా డేను కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయంలో బుధవారం నిర్వహించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి ఆధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ అప్పలనాయుడు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను వివరించారు. వ్యాధి నిరోధానికి క్రమం తప్పకుండా మందులను వాడడంతోపాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. విశాఖ కేన్సర్ హాస్పిటల్ హెమటాలజిస్ట్ డాక్టర్ రమేష్ ఉప్పాడ మాట్లాడుతూ వ్యాధి నివారణకు స్టెమ్‌సెల్ థెరపీ వైద్యవిధానం కొద్దిరోజుల్లో అందుబాటులోకి రానుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మలీల మాట్లాడుతూ వ్యాధి పీడితులకు ప్రభుత్వం నెల నెలా రూ.10వేలు అందిస్తోందని, రక్తాన్ని వివిధ ఎన్జీఓలు ఉచితంగా సమకూర్చుతున్నట్టు వెల్లడించారు. వీసీ కట్టిమణి మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనీమియా జన్యుపరమైన రక్తవ్యాధి అని, ఇది బాధిత రోగి మొత్తం జీవితాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. న్యూఢిల్లీకి చెందిన ఐసీఎంఆర్ సహకారంతో కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం బయోటెక్నాలజీ హెడ్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి అరకు, పాడేరు ప్రాంతాలలో వ్యాధిపై పరిశోధనలు చేస్తున్నట్టు వివరించారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు వర్సిటీ ద్వారా ఉచిత విద్య, హాస్టల్ వసతి, పుస్తకాలు సమకూర్చుతామన్నారు. అనంతరం సికిల్‌సెల్ ఎనీమియా రోగులను, సహాయకులతో వీసీ మాట్లాడారు. వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్, డీన్‌లు శరత్చంద్రబాబు, జితేంద్ర మోహన్ మిశ్రా, పరీక్షల అధికారి ప్రొఫెసర్ బి.కివాడే, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ దాస్, డాక్టర్ దివ్య, డాక్టర్ నగేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రమీలాదేవి, తదితరులు

సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

పూసపాటిరేగ: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్యాధికారి ప్రమీలాదేవి అన్నారు. పూసపాటిరేగ కేజీబీవీలో వైద్యాధికారి రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో బాలికలకు వ్యాధిపై బుధవారం అవగాహన కల్పించారు. 2047 సంవత్సరానికి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా భారత ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. వ్యాధి లక్షణాలు, వైద్యం వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ మహేశ్వరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేదమణి, సూపర్ వైజర్లు ఉమాపతి, నానమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ భారతి, వెలుగు ఏపీఓ నాయుడు, సీసీలు లక్ష్మణ, శ్రీను, ఆరోగ్యసహాయకులు ఆర్.వి.రమణ పాల్గొన్నారు.



సికిల్‌సెల్ ఎనీమియా రోగుల కుటుంబీకులతో వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

మొక్కజొన్న సాగుకు మొగ్గు



పతివాడలో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

- జూలై 15 వరకు విత్తుకు అనుకూలం

పూసపాటిరేగ: మొక్కజొన్న సాగుకు మండల రైతులు మొగ్గు చూపిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆదాయం వస్తుండడంతో అధిక విస్తీర్ణంలో పంటను సాగుచేస్తున్నారు. అదునుగా ఉన్న నేలల్లో మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్నారు. జూన్ ఆరంభం నుంచి జూలై 15వ తేదీ వరకు మొక్కజొన్న పంట సాగుకు అనుకూలమని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా సుమారు 50 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. జూలై 15 నాటికి సుమారు వెయ్యి ఎకరాల పైబడి మొక్కజొన్న సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో 1300 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. పంటకు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

అధిక ఆదాయం

మొక్కజొన్న సాగుతో గత కొన్నేళ్లుగా రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. అయితే, ఖరీఫ్, రబీ సీజన్లలో ఒకే భూమిలో కొందరు రైతులు పంట సాగు చేయడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. పంట మార్పిడి చేయడం మంచిది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటను సాగుచేయడం శుభపరిణామం.

– కె.నీలిమ, వ్యవసాయ అధికారి, పూసపాటిరేగ

'నేను బడికి పోతా'ను విజయవంతం చేద్దాం

- బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలి
- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం:

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ తలపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎడ్యుకేషన్ కార్యదర్శులకు కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు పిలుపునిచ్చారు. కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వార్డు సచివాలయం కార్యదర్శులు, నగర పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే బాధ్యత ఎడ్యుకేషన్ కార్యదర్శులదేనని అన్నారు. ప్రతి హ్యాబిటేషన్ పరిధిలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని బడి బయట పిల్లలను బడిలో చేర్పించే విధంగా చూడాలన్నారు. పిల్లల తల్లిదండ్రుల్లో సంపూర్ణ విద్యా చైతన్యం తీసుకురావాలన్నారు. నూతనంగా బడిలో చేరిన పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించాలని సూచించారు. వయసుకు తగ్గ తరగతిలో చేర్పించి విద్యనభ్యసించేలా బ్రిడ్జి కోర్సులు నిర్వహించాలన్నారు. బడిలో చేరిన పిల్లలకు అవసరమైన పుస్తకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో మండల విద్యాశాఖ అధికారులు ఆనందమూర్తి, సత్యవతి, నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ఇన్‌చార్జిలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

సేవల్లో చిన్నశ్రీను సోల్జర్స్



సిరి సహస్ర జన్మదినం సందర్భంగా అన్నదానం చేస్తున్న హిజ్రాలు

విజయనగరం: చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకురాలు సిరిసహస్ర జన్మదిన వేడుకలు సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధర్మపురిలో సోల్జర్స్ సభ్యులు చందక శ్రీనివాసరావు, రాము ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 300 మంది రోగులకు శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రైల్వే స్టేషన్ దగ్గర నిరుపేదలకు పులిహోరా పాకెట్స్ పంపిణీ చేశారు. ప్రేమసమాజంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు అన్నదానం చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పేదలకు అన్నసంతర్పణ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పేదలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోటవాసు, సభ్యులు రామకృష్ణ, హేమంత్, శ్రీనివాసరావు, రాము, భాస్కర్, శ్రీనివాస్, జగన్, మజ్జి ప్రసాద్, తట్లపు ప్రసాద్, అభిరామ్, అశోక్, పతివాడ శంకరరావు, బెవర రామకృష్ణ, రమేష్, శివ, అశోక్, అప్పారావు, లంకాపట్నం రమణ, అలుగోలు త్రినాథా, పకీర్, అలమండ శివ, కొత్తకోట రమేష్, సాయి, దుంపగణేష్, రాకేష్, చిన్నారావు, రమేష్, శ్రీనివాసరావు, ఆనంద్ పాల్గొన్నారు.

పూడికలు తొలగించాలి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమైన ఎంపీపీ సుధారాణి

నెల్లిమర్ల: ఉపాధిహామీ పనుల్లో భాగంగా గ్రామాల్లోని సాగునీటి కాలువల్లో పూడికలు తొలగించాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్షేత్రసహాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పంట పొలాలకు సాగునీరు అందించే ప్రధాన, పిల్ల కాలువల్లో పూడికలు తొలగించి, రైతులకు సాగునీటి అంతరాలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రామారావు, ఈఓపీఆర్డీ సింహాద్రి, ఏపీఓ అరుణ, సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములనాయుడు పాల్గొన్నారు.

సామూహిక అక్షరభ్యాసాలు



దబ్బిరాజుపేటలో పిల్లలతో అక్షరభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సామూహిక అక్షరభ్యాసాల కార్యక్రమం నిర్వహించారు. దబ్బిరాజుపేట, పాటూరు, రాయుడుపేట ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయు లు ఆర్.శంకరరావు, ఎం.సతీష్, పి.వెంకటరమణ ఆధ్వర్యంలో పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు. పిల్ల లతో ముందుగా సరస్వతీదేవి పూజ చేయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణకు విరివిగా వైద్యశిబిరాలు



శిబిరంలో విద్యార్థులను పరీక్షిస్తున్న సీహెచ్‌సీ సూపరింటెండెంట్ నాయక్, వైద్య సిబ్బంది

చీపురుపల్లి: క్షయ (టీబీ)వ్యాధి నిర్ధారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అందులో భాగంగానే విరివిగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.పి.వి.నాయక్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీలో విద్యార్థుల కోసం బుధవారం ప్రత్యేకంగా టీబీ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వ హించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ గౌరీశంకర్, డీసీహెచ్ఎస్ కె.రాణి, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌రావు ఆదేశాల మేరకు ఈ బిరం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థుల నుంచి కఫం రహిత నమూనాలను వైద్య సిబ్బంది సేకరించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో టీబీ లక్షణాలు ఉన్న చిన్న పిల్లలను గుర్తించడంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు చురుగ్గా వ్యవహరించాలన్నారు.


అక్రమణల తొలగింపు



భోగాపురం క్షీర సాగరంలో ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

భోగాపురం: భోగాపురం మేజర్ పంచాయతీ పరిధి ఎస్సీ, బీసీ కాలనీ సమీపంలోని క్షీరసాగరం చెరువు అక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. సర్వే నంబర్ 314లో ఉన్న క్షీర సాగరం చెరువులో సుమారు 70 సెంట్లు స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేశారు. అక్రమకట్టడాలకు పూనుకున్నారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులు నోటీసులు జారీ చేసినా కట్టాడాలను ఆపలేదు. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమంగా నిర్మించిన ప్రహరీ గేడు, ఫెన్సింగ్, కమ్మల పాకలను జేసీబీతో తొలగించారు. మిగిలిన ఆక్రమణలను కూడా తొలగిస్తామని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కేవలం తమపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే అక్రమణలు తొలిగించారని, ఈ చెరువులో ఇంకా చాలా అక్రమణలు ఉన్నాయని బాధితుడు ఈశ్వరరావు అవేదన వ్యక్తం చేశారు. ఈ తొలగింపు ప్రక్రియలు ఆర్ఐ కిషోర్, మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, వీఆర్వో రామునాయుడు, ఎస్ఐ సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

గజపతినగరం: దావాలపేట గ్రామంలోని మహంకాళి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని ధర్మవరం దేవస్థానం ఈఓ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఏడాదిలో రూ.1,76,039 ఆదాయం వచ్చిందని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఈఓ కె.శ్రీరామ్,గ్రామ పెద్దలు బూడి వెంకటరావు,పొట్నూరు అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి గరుడసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

జామి: మండలంలో భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధ వారం గరుడసేవను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు.ఈసందర్భంగా కోలాటం,తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఉచితంగా బీపీ, సుగర్ వైద్య పరీక్షలు



వాకర్స్‌కు బీపీ, సుగర్ వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం: నగరంలోని శ్రీసాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా నిర్వహించిన బీపీ, సుగర్ వైద్య పరీక్షల శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాస్టారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తరుచూ బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవాలని, ఆహార నియమాలను పాటించడం అవసరమని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారు ఎ.తిరుపతిరావు, కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన పౌర సేవలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని కార్యదర్శులకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఆదేశించారు. నగరంలోని 21, 22 నంబర్ సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ప్రజా ఫిర్యాదుల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ, అందిస్తున్న పౌర సేవలపై ఆరా తీశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న కార్యదర్శుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రధాన రహదారులు, వీధులలో భవన వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రజారోగ్య అధికారులకు తెలపాలన్నారు. ప్రతీ ఇంటి సెప్టిక్ ట్యాంకు గొట్టాలపైన తెరలు అమర్చేలా ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలన్నారు. తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలలో అవగాహన వచ్చిందని, ఎప్పటికప్పుడు ఘన వ్యర్థ పదార్థాల వర్గీకరణ ఆవశ్యకతను వివరించాలన్నారు. అనంతరం ఆచంట గార్డెన్ నిర్వహణ పనితీరును ఆయన పరిశీలించారు. లోపాలను గమనించి అక్కడున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న యువత

శృంగవరపుకోట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. కేశవరావు, స్కిల్ ఆఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.ఈరన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉన్న ఇంటర్మీడియట్, డిగ్రీ పాసైన యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల శిక్షణ పూర్తయిన తర్వాత ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పాత బ్యాచ్‌కు శిక్షణ ముగియనుందని, కొత్త బ్యాచ్‌కు శిక్షణ త్వరలో ప్రారంభించనున్నామని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 24వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 90002 34642, 79956 91295 నంబర్లను సంప్రదించాలని సూచించారు.